క్లుప్తంగా

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేసి టెక్నికల్ సింపోజియంను ప్రారంభిస్తున్న దృశ్యం

కుప్పం రూరల్: సాంకేతిక రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులను విద్యార్థులు నిశితంగా పరిశీలిస్తూ వాటిని అందిపుచ్చుకోవాలని కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ సునీల్‌రాజ్ అన్నారు. గురువారం కళాశాల ఆవరణలో అంతరిక్ష (టెక్నికల్ సింపోజియం)–2 కే 24ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, సాంకేతిక రంగంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ, మెషిన్ లెర్నింగ్‌లో వస్తున్న మార్పులను గమనించాలన్నారు. అలాగే ఆయా విభాగాల్లో వస్తున్న మార్పులను పరిశీలిస్తేను భవిష్యత్తులో రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయు కలికిరి అధ్యాపకులు షేక్ నజీరా, క్రిష్ణగిరి కళాశాల అధ్యాపకులు శ్రీనివాసన్, కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దున్నపోతు ఊరేగింపు



దున్నపోతుకు నిర్వహిస్తున్న పూజలు

సదుం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో 7, 8వ తేదీలలో గంగజాతర నిర్వహించనున్నారు. దీనికిగాను నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దున్నపోతును మేళతాళాలతో గురువారం ఊరేగించారు. ఇంటింటా పూజలు చేశారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు



సచివాలయం వద్ద కోడ్ ఉల్లంఘనపై హెచ్చరిస్తున్న అధికారులు

కుప్పం: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హరికుమార్, అర్బన్ సీఐ రమణ, కమీషనర్ నాగేశ్వరావు హెచ్చరించారు. పింఛన్ల పంపిణీపై రాజకీయ పార్టీల మధ్య వివాదం తలెత్తిన నేపథ్యంలో ప్రభుత్వ అధికారులు పింఛనుదారులకు సక్రమంగా సొమ్ము పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే కోడ్ అమలులో ఉన్నప్పుడు రాజకీయ పార్టీలు సచివాలయం వద్ద పింఛనుదారులకు మజ్జిగ ప్యాకెట్లు, వాటర్, కూల్‌డ్రింక్స్ లాంటివి సరఫరా చేయడం, అలాగే ఆటోలు ఏర్పాటు చేసి పింఛనుదారులకు సచివాలయాలకు తీసుకురావడం, వారికి సదుపాయాలు కల్పించటం కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందని స్పష్టం చేశారు. ఇలాంటి వాటిపై ఫిర్యాదులు అందితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇక, సచివాలయం వద్దకు రాలేని లబ్ధిదారులకు నేరుగా అధికారులే పింఛన్లు అందజేస్తారన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

యాదమరి(పూతలపట్టు): జూదం ఆడుతున్న 9 మందిని అరెస్ట్ చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. సీఐ రవిశంకర్‌రెడ్డి కథనం.. అందిన రహస్య సమాచారం మేరకు యాదమరి మండలం దళవాయిపల్లె పంచాయతీ పరిధిలోని మామిడితోట వద్ద పోలీసులు దాడులు చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న 9 మందిని ఎస్‌ఐ రామాంజనేయులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2,07,370, నాలుగు మోటారు బైకులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల పర్యటన

పుంగనూరు: వైఎస్సార్‌సీపీ పుంగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి మండలంలో శుక్ర, శనివారాలు ఎన్నికల ప్రచారం చేస్తారని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు. పెద్దిరెడ్డి తొలుత ఆరడిగుంటలో ఉదయం 8 గంటలకు ప్రచారాన్ని ప్రారంభించి, అక్కడి నుంచి సింగిరిగుంట, మేలుందొడ్డి, వనమలదిన్నె, మాగాండ్లపల్లె, ఏటవాకిలి, మంగళం భీమగానిపల్లె, మోదుగులపల్లె, ఎంసీ.పల్లె పంచాయతీలలో పర్యటించి సాయంత్రం సుగాలిమిట్టలో 4.30 గంటలకు ప్రచారాన్ని ముగిస్తారని, అలాగే 6న ఉదయం 8 గంటలకు నేతిగుట్లపల్లెలో ప్రచారం ప్రారంభించి, నెక్కుందిలో సాయంత్రం 4 గంటలకు ప్రచారం ముగిస్తారన్నారు. ఈ ప్రచారాలలో జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, ఏఎంసీ చైర్మన్, ఆయా సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ అభిమానులు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ముస్లింల ఇఫ్తార్ విందు

పుంగనూరు: పట్టణంలోని అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిలకు శుక్రవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఇవ్వనున్నట్లు ఆ కమిటీ అధ్యక్షుడు ఎంఎస్.సలీం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అంజుమన్ షాదీ మహల్‌లో ఏర్పాటు చేశామని, పట్టణ ప్రజలు పాల్గొనాలని కోరారు.

గంగవరం: కీలపట్ల సచివాలయం వద్ద పింఛన్ల కోసం వేచివున్న పింఛనుదారులు, రొంపిచెర్ల: గ్రామ సచివాలయంలో పింఛన్ల కోసం ఎదురు చూపులు





'బాబు'కు పింఛనర్ల శాపనార్థాలు

- రెండో రోజూ తప్పని అవస్థలు
- చంద్రబాబుపై తిట్ల దండకం
- వికలాంగులు, మంచానికే పరిమితమైన రోగులకు ఇంటి వద్దనే పింఛన్లు



పలమనేరు: సచివాలయాల్లో పింఛను పొందుతున్న లబ్ధిదారులు

పలమనేరు: ఇళ్ల వద్ద ఏ ఇబ్బందులూ లేకుండా పింఛన్లు పొందుతున్న తమను ఇప్పుడు అవస్థలు పడుతూ సచివాలయాలకు వచ్చేలా చేసిన చంద్రబాబుకు తమ ఉసురు తగలక మానదని సామాజిక పింఛనుదారుల శాపనార్థాల పర్వం రెండో రోజు కూడా కొనసాగింది. ఈ వయసులో తమను ఇక్కట్ల పాలయ్యేలా చేసిన ఆయన ఆడిన డ్రామాలకు తగిన బుద్ధి చెబుతామని పలువురు చెప్పారు.

సజావుగా పంపిణీ

నియోజకవర్గంలో గురువారం పింఛన్ల పంపిణీ సచివాలయాల వద్ద ప్రశాంతంగా సాగింది. పలు సచివాలయాల్లో పింఛనుదారులు వేసవి తాపానికి గురికాకుండా ఉండేందుకు చలువపందిళ్లు వేశారు. వారికి మంచినీటి సౌకర్యం కల్పించారు. క్యూలలో నిలబడలేని వారికోసం సచివాలయ సిబ్బంది కుర్చీలను ఏర్పాటు చేశారు. అవరోధాలు లేకుండా పింఛన్లు పంపిణీ చేశారు.

మున్సిపాలిటీలో 90, గ్రామాల్లో 80 శాతం..

నియోజకవర్గంలో మొత్తం పింఛనుదారులు 46వేల మంది ఉన్నారు. బుధవారం సాయంత్రం నుంచి పింఛన్ల పంపిణీ మొదలవడం విదితమే. తొలిరోజే దాదాపుగా 30శాతం పంపిణీ చేశారు. ఇక గురువారం మున్సిపాలిటీలో 90 శాతం, మండలాల్లో 65 నుంచి 70శాతం పింఛన్లను పంపిణీ చేశారు. శుక్రవారం వందశాతం పూర్తి చేయనున్నారు.

ఇళ్ల ముంగిటే అందిన పింఛన్లు

నియోజకవర్గంలో 350మంది వరకూ పింఛనుదారులు మంచానికే పరిమితమై ఉన్నారు. వీరి ఇళ్లకు సచివాలయ సిబ్బంది వెళ్లి వేలిముద్రలు తీసుకుని పింఛన్లు పంపిణీ చేశారు. కొందరిని కుటుంబ సభ్యులు ఆటోలలో సచివాలయానికి తీసుకురాగా, వారికి ఆటోల్లోనే పింఛన్లు అందజేశారు.

పింఛన్ల పంపిణీ 90 శాతం పూర్తి

గంగవరం: మండలంలోని గ్రామ సచివాలయాలలో బుధ, గురువారాల్లో పింఛన్ల పంపిణీ దాదాపు 90 శాతం పూర్తయినట్టు ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. పింఛన్ల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. సచివాలయ ఉద్యోగులు జాప్యం చేయకుండా పింఛన్లు పంపిణీ కొనసాగించారు. పెద్దసంఖ్యలో పింఛనుదారులు రావడంతో ఎండకు ఇబ్బంది పడకుండా షామియానా వేశారు. శుక్రవారం వంద శాతం పంపిణీ పూర్తి చేస్తామని ఎంపీడీఓ చెప్పారు. ఇదలా ఉంచితే, ఇంటికాడికే వచ్చి వలంటీర్లు పింఛన్లు ఇవ్వడమే బాగుందని, సచివాలయానికి వచ్చి తీసుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని పలువురు వాపోయారు. దీనికి కారణమైన టీడీపీ వాళ్లకు తమ ఉసురు తగలక మానదని శాపనార్థాలు పెట్టారు.

పింఛన్ల కోసం పొద్దున్నే వచ్చేశారు

రొంపిచెర్ల: మండలంలో పింఛన్ల కోసం ఉదయం ఏడు గంటలకే గ్రామ సచివాలయాలకు వృద్ధులు, వికలాంగులు చేరుకున్నారు. సచివాలయ సిబ్బంది 10.30 గంటలకు విధులకు హాజరై పింఛన్లు పంపిణీ చేశారు. పలువురు పింఛనుదారులు తాము ఇబ్బందులు పడుతూ సచివాలయానికి వచ్చినట్టు చెప్పారు. ఏ కష్టమూ లేకుండా ఇంటికే వలంటీర్లు పింఛన్లు ఇచ్చినప్పుడు బాగుండేదని, ఇప్పుడు వలంటీర్లను ఇవ్వకుండా చేసి, తమను అవస్థలకు గురి చేస్తున్నారని టీడీపీకి శాపనార్థాలు పెట్టారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి బుద్ధి చెబుతామంటూ ఇళ్లకు తిరుగుముఖం పట్టారు.

చంద్రబాబుకు మా ఉసురు తగులుతుంది



వయస్సు మీద పడింది. నడవలేని స్థితి ఉన్నాం.వలంటీర్లు పెన్షన్లు ఇవ్వకుండా ఎన్నికల కమిషన్‌కు చంద్రబాబు ఫిర్యాదు చేయించి అడ్డుకున్నారు. ఐదేళ్లుగా ఇంటిపట్టునే నిమ్మళంగా పింఛను తీసుకుంటున్న నేను ఇప్పుడు పెన్షన్ కోసం బయటకు రావాల్సి వచ్చింది. చంద్రబాబుకు మా ఉసురు తగులుతుంది. ఇబ్బందులు పడి సచివాలయానికి వచ్చా. పెన్షన్ తీసుకునేందుకు చాలా కష్టంగా ఉంది. ఈసారి చంద్రబాబుకు ఓట్లు వేసి ఎవరూ ఈ బాధలు తెచ్చుకోరు. –రామయ్య, బీసీ కాలనీ, పులిచెర్ల మండలం







సచివాలయానికి వస్తుండగా ఆటోలోనే పింఛను ఇస్తున్న సిబ్బంది, నడవలేని మునెమ్మకు, మంచానికే పరిమితమైన రోగికి ఇంటి వద్ద ఇస్తున్న పింఛను







పలమనేరులో ఇళ్లకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఇంటింటా ప్రచారం



రొంపిచెర్లలో ప్రచారం చేస్తున్న మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్

రొంపిచెర్ల: సార్వత్రిక ఎన్నికల్లో పుంగనూరు ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని గెలిపించాలని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్ ఇంటింటా గురువారం ప్రచారం చేశారు. మంత్రి పెద్దిరెడ్డి సహకారంతో గ్రామ పంచాయతీలో 90 శాతం అభివృద్ధి పనులను పూర్తి చేశామని, పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయించామన్నారు. ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కరీముల్లా, మల్లికార్జున రెడ్డి, మస్తాన్, కాలేషా, హిమయతుల్లాబేగ్, బావాజీ, ఎల్.మహబుబ్ బాషా, యర్రంరెడ్డి, వెంకటరమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



మాట్లాడుతున్న ఎంఈఓ లీలారాణి

పలమనేరు: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పలమనేరు ఎంఈఓ లీలాకుమారి అన్నారు.ఏపీ నేషనల్ గ్రీన్‌కార్ప్స్ ఆధ్వర్యంలో స్థానికప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గురువారం పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంఈఓ మాట్లాడారు.విద్యార్థి దశ నుంచే పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ అంశంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రతాప్, టీచర్లు పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో పలమనేరు ప్రకృతి ప్రేమికుడు మల్లిచెట్ల దేవేంద్ర.. పట్టణవాసులకు మొక్కలను తాను ఉచితంగానే సరఫరా చేస్తానని, విరివిగా నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పలు రకాల మొక్కలను నాటారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

బంగారుపాళెం: మండలంలో జిల్లేడుపల్లెలో గురువారం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని ప్రధానోపాధ్యాయుడు బాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. చదువుల తల్లి సరస్వతీదేవి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను తెలియజేశారు. పేద విద్యార్థులు రూపాయి ఖర్చు లేకుండా ఒకటో తరగతి నుంచి ఉన్నత విద్యవరకు చదువుకునే అవకాశం కేవలం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలోనే ఉందన్నారు. కార్యక్రమంలో మంగళపల్లె జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జయకాంతన్, అరుణ్ శివప్రసాద్, మాజీ సర్పంచ్ అశోక్‌రెడ్డి, త్యాగరాజరెడ్డి పాల్గొన్నారు.

'పండుటాకులు' విలవిల

శాంతిపురం: మండుటెండలో అవస్థలు పడుతూ సచివాలయాలకు వచ్చిన పింఛనుదారులకు కష్టాలు తప్పలేదు. వేసవి తాపానికి నీరసించిపోయారు. మండలంలోని మొత్తం 8,321 పింఛన్లలో బుధ, గురువారాల్లో 7,241 మందికి రూ 2.14 కోట్లను పింఛన్ల రూపేణా అధికారులు సచివాలయాలలో పంపిణీ చేశారు. మిగతా 1,080 పింఛన్లలో స్థానికంగా అందుబాటులో లేని వారు మినహా పడకకే పరిమితమైన వారికి మాత్రం వారి ఇళ్లకు వెళ్లి పింఛను ఇవ్వనున్నట్టు చెప్పారు. నడవలేని వారికి ఇళ్లవద్దే పింఛను ఇచ్చేందుకు ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లు చేసినా, ఆ విషయం తెలియక చాలామంది తమ బంధువులను మోసుకొంటూ వచ్చి పింఛన్లు పొందారు.

కోడ్ ఉల్లంఘించి..టీడీపీ నేతల ఓవరాక్షన్

మరో వైపు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి వలంటీర్ల ద్వారా ఇళ్ల వద్ద పెన్షన్ సొమ్ము అందకుండా చేసిన టీడీపీ నాయకులు కొత్త డ్రామాలకు తెరదీశారు. ప్రజల్లో ఆగ్రహం, వ్యతిరేకత వ్యక్తమవుతుండడంతో అన్ని పింఛన్ పంపిణీ కేంద్రాల వద్ద ఎన్నికల కోడ్ ఉల్లంఘిపించనుదారులకు మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లు వచ్చి వారిని మచ్చిక చేసుకునేందుకు ఆపసోపాలు పడటం కనిపించింది. చేసిందంతా చేసి ఇప్పుడేందయ్యా! ఓవరాక్షన్ అంటూ కొందరు లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇంటికెళ్లి పెన్షన్ పంపిణీ



కోటూరులో నూరుల్లాకు పెన్షన్ సొమ్మును అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ మోహన్‌కుమార్

చౌడేపల్లె: మండలంలోని పెద్దకొండామర్రి పంచాయతీ కోటూరుకు చెందిన బి.నూరుల్లా ఇంటికి వెళ్లి వెల్ఫేర్ అసిస్టెంట్ మోహన్‌కుమార్ గురువారం పెన్షన్ సొమ్మును అందజేశారు. 'సాక్షి'లో 'వీళ్లకు ధూం తగలా' శీర్షికతో వచ్చిన కథనంలో నూరుల్లా ఆవేదనపై అధికారులు స్పందించారు. సచివాలయం వద్దకు వెళ్లలేని వృద్ధులు, వికలాంగుల ఇళ్లకే వెళ్లి పెన్షన్‌ను అందజేశారు.

మైనారిటీలకు పెద్దపీట వేసింది వైఎస్సార్‌సీపీనే



ముస్లిం మైనారిటీల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే వెంకటేగౌడ

- ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: మైనారిటీలకు పెద్దపీట వేసింది వైఎస్సార్‌సీపీనేనని ఎమ్మెల్యే వెంకటేగౌడ స్పష్టం చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణంలోని ముస్లిం మైనారిటీలతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆ తర్వాత జగనన్న తమ పాలనలో ముస్లిం మైనారిటీల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. ఎంతోమంది పేద ముస్లింల పిల్లల ఉన్నత చదువులు చదివారంటే దానికి కారణం వైఎస్సార్, ఆయన తనయుడు ఇచ్చిన ప్రాధాన్యతేనని చెప్పారు. విద్యకు పెద్దపీట వేసి భవితకు బాటలు వేశారని, చదువును మించిన ఆస్తి లేదన్నారు. గత ప్రభుత్వానికి, ఇప్పటి తమ ప్రభుత్వానికి ఉన్న తేడాను గమనించాలని కోరారు.మేలు చేసిన పార్టీకి ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. రంజాన్ పండుగ సందర్భంగా ఇఫ్తార్ విందు తదితరాలపై చర్చించారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జాఫర్, పట్టణంలోని ముస్లిం పెద్దలు, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే

పలమనేరు: స్థానిక 19వార్డు ఎంబీఎస్ కాలనీకి చెందిన ముస్లింలు గురువారం సాయంత్రం ఆత్మీయ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరై, ముస్లింలతో కలిసి నమాజు చేశారు. వారికి పవిత్ర రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు.

అవ్వాతాతలను ఏడి'పింఛెన్'



కుప్పం సచివాలయం వద్ద నిరీక్షిస్తున్న పింఛనుదారులు

- సచివాలయాల వద్ద బారులు తీరిన జనం
- గత ప్రభుత్వ పాలన నాటి కష్టాలు పునరావృతం



సచివాలయంలో గుమిగూడిన లబ్ధిదారులు

కుప్పం: ఐదేళ్లుగా ప్రశాంతంగా ఇంటి వద్దే సామాజిక పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులకు టీడీపీ నేతల నీచ రాజకీయాలకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. ప్రతి నెలా 1వ తేదీన తెల్లవారకముందే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేస్తుండటం, ఈ ప్రక్రియ టీడీపీ నేతల కుత్సిత రాజకీయాలకు తెరపడటం విదితమే. దీంతో లబ్ధిదారులకు ఇబ్బందులు మొదలయ్యాయి. గురువారం సచివాలయాలకు శ్రమలకోర్చి వచ్చిన వృద్ధులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. మండుతున్న ఎండలు తట్టుకోలేక ఇబ్బందులు పడ్డారు. కుప్పం మున్సిపాలిటీలో సచివాలయం–1, సచివాలయం–2, కొత్తపేట, మోడల్ కాలనీ, డీకేపల్లె సచివాలయాలు పింఛనుదారులతో కిక్కిరిశాయి. మున్సిపల్ పరిధిలోని 12 వార్డు సచివాలయాలకుగాను గురువారం 1,176 మందికి పింఛన్లు పంపిణీ చేశారు.

కళ్లు కనబడవు.. నేనెలా పింఛను తెచ్చుకోవాలి?



కళ్లు కనబడవు. లేచి నడవలేని స్థితిలో ఉన్నా. నాకు మూడు రోజులుగా ఆరోగ్యం బాగాలేదు, పింఛను డబ్బులు వచ్చింటే ఆస్పత్రికి పోయి ఉండేదాన్ని. మా కూతురు ఇంట్లో ఉంటున్నా. సచివాలయానికి వెళ్లి ఎట్లా పోవాలి? మమ్మల్ని ఇబ్బంది పెడితే చంద్రబాబుకు ఏమొస్తుంది?మాలాంటి ముసలోళ్లను కష్టపెడితే అంతకు రెండింతుల అనుభవిస్తారు.

–సుమిత్రమ్మ, ఎన్‌టీఆర్ కాలనీ, కుప్పం

మూడు రోజులుగా నరకం చూస్తున్నాం



ప్రతి నెల ఒకటో తేదీ వలంటీరు పింఛను ఇవ్వగానే మందులు, మాత్రలు తెచ్చుకునేవాళ్లం. మూడు రోజులుగా పెన్షన్ రాక మాత్రలు తినలేదు. ఆరోగ్యం బాగాలేదు. కూర్చుంటే లేచేకి కాదు..ఈమాదిరిగా ఉంటే నడచిపోయి పింఛను ఎట్లా తీసుకోవాలో చెప్పండి? ఆ చంద్రబాబుకు బుద్ధి లేదా..? ఆయన కూడా ఇంతకుముందు సీఎంగా ఉన్నాడు కదా..ఆయన సీఎంగా ఉన్నప్పుడు పింఛన్ల కోసం ఎట్లా కష్టాలు పడినారో ఇప్పుడు అట్లే పడాల్సి వస్తాంది. పేదల కడుపు మంట చంద్రబాబుకు తగలకపోదు.

– అలివేలమ్మ, ఎన్‌టీఆర్ కాలనీ, కుప్పం

మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామా



సదుం: రాజీనామా లేఖలను ఎంపీడీఓకు అందజేస్తున్న వలంటీర్లు

సదుం: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని 184 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేసినట్టు తెలిపారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో తమ రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓ రాజశేఖర్‌బాబుకు అందజేశారు. వలంటీరు వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వానికి లబ్ధిదారుల మధ్య వారధిగా నిలుస్తూ నిస్వార్థంగా సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఇటీవల గత కొద్ది రోజులుగా తమ సేవల పట్ల ప్రతిపక్ష నాయకులు అవమానపరుస్తూ చేస్తున్న దుష్ప్రచారానికి మనస్తాపం చెంది, స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్టు చెప్పారు.

కుప్పం రూరల్‌లో..



కుప్పం రూరల్: రాజీనామా లేఖలను ఎంపీడీఓ ఖాదర్‌బాషాకు అందజేస్తున్న వలంటీర్లు

కుప్పం రూరల్: కుప్పం మండలంలోని ఉర్లవోబనపల్లెపంచాయతీకి చెందిన 15 మంది వలంటీర్లు గురువారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా లేఖలను కుప్పం ఎంపీడీఓ ఖాదర్‌బాషాకు అందజేశారు. వలంటీర్లు మాట్లాడుతూ, టీడీపీ నేతలు సంక్షేమ పథకాల అందజేతలో అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తుండడంతో రాజీనామాలు చేశామని చెప్పారు. మరోసారి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు తాము కృషి చేస్తామన్నారు. సర్పంచ్ అబ్బు సమక్షంలో వలంటీర్లు రాజీనామాలు చేశారు.